
ప్రకృతిలో మమేకమై జీవించే మనిషి తోటి మనుషులతో, జంతువులతో జీవించే విధానమెలాగ ఉంటుంది? నాగరికతా కేతనాలని భావించే జనావాసపు పగళ్లకు, ఆ టవిక రాజ్యాలని అనుకునే అడవుల రాత్రులకు మధ్య ఉండే తేడా ఏమిటి?

## మధురాంతకం నరేంద్ర

# 14 అడివిరేత్రి

వి. పద్మనాభన్





“జలజలా పారతా వుండే ఆ నీళ్లల్లో యీదతా వుండే జలపుష్పాలు అల్లితామరపూల కంటే అందంగా లేవా మీ కండ్లకు?” అని నవ్వతా పెద్దగుండు పైన్నించీ వడ్డారంగా కిందికి అడుగేసినానంతే! మరుక్షణంలో యేం జరిగిందో నాకు తెలవదు. కండ్లు బైర్లు కమ్మేసినాయి. వొల్లు స్మారకం తప్పొయింది.

చిత్తిరినెల పవుర్ణమినాడొచ్చే తుంబరతీర్థం తిరణాలకు పోదాం రమ్మంటే యినలేదుగానీ ఆపై నెల్లో యెట్లయినా పొయ్యే కావాలని పట్టుబట్టుకోని కుచ్చునింది ప్రభావతి. పాపనాశినం కాడుండే ఫారెస్టాయిన్ను కాళ్లూచేతులూ పట్టుకోని అడుక్కుంటే ట్రెక్కింగ్ కోసరమని తిరుపతినించి వచ్చే గుంపుతో కలుసుకోని పొమ్మన్నాడు. ఆ పదారుమందితో గూడా తెల్లారెప్పుడో పాపనాశినం దాటుకోని అడివిలోకి బయిల్దేరినోళ్లం. ప్రభావతి యెనకాల తోకల మాదిరిగా రాజేష్‌గాడూ, రమణగాడూ గూడా మా వూరినించీ యెలబారేసినారు. కొంగుబట్టుకోని తిరిగినట్టుగా యెనకాలే వస్తా వుండే మా ముగ్గురితోనూ వొకేరకంగా వుండాది ప్రభావతి.

రాజేషుగాడికి పిత్రార్జితంగా అయిదెకరాల మడికయ్యుండాది. రమణగాడికి వాళ్లనాయిన జేసే వండ్రంగంపని రెండు చేతలనిండా వుండాది. దినమ్మూ వూర్లోవాళ్లు పోసే పాలు రెండు కాన్లెత్తుకోని పేటకు పొయి అమ్ముకోనొచ్చే పనిలో నేను మిగలబెట్టిందేమీలేదని ప్రభావతికి తెలియకుండాపోదు. డిగ్రీదాకా చదువుకోని వూర్లో వాళ్ల నాయిన పెట్టుకోనుండే చిల్లరంగిడిని వొంటిచేత్తో నడపతా వుండే పిల్లకు తెలియని తెలువులేమీ వుండవు గదా! డిగ్రీ ఫెయిలయి నెత్తిమీదికి యిరవై తొమ్మిదేళ్లొచ్చి యింకా పెండ్లీగిండ్లీ అనుకోకుండా మోరెత్తుకోని తిరగతా వుండే నేనంటే ఆ అమ్మికదోరకం యిష్టమని మాత్రం నాకు నమ్మకముండాది. అందుకనే ఆ అమ్మికోసరమనే యీరకంగా తుంబురుతీర్థానికి బయల్దేరొచ్చినాను.

ట్రెక్కింగోళ్లంతా చరచరా ముందుకెలబారిపోతే మేమయిదుగురు మాత్రమే యెనకబడిపొయుండాము. నేనూ, ప్రభావతీ, మాతో కూడా రాజేషూ, రమణా; మా నలుగురికీ దోవ జూపించేదానికి సుబ్బరాయుడు. యీ అడవిలో సరిగ్గా దోవ

జూపించేదానికని ఫారెస్టాయిన యిద్దురు గువ్వలోళ్లను తోడుగా అంపించినాడు. వాళ్లల్లో నర్సింహులు ముందు పొయినోళ్లతో వుండాడు. మాకీ సుబ్బరాయుడు మిగిలినాడు.

యెండ పడమరకు తిరిగింది. యాభై అరవై అడుగులు పొడుగుండే రెండు కొండల నడిమధ్యలో, నాలుగైదు బారల వెడల్పుండే దోవలో తుంబురుతీర్థం దాకా రెండు మూడు మైళ్లు పొయ్యేసి తిరుక్కోని వస్తావుండామప్పుడు. యెప్పుడో కొన్ని లక్షల వేల సమత్సరాల ముందెప్పుడో యేందో ప్రళయమొచ్చినప్పుడు, యీ కొండ యీ మాదిరిగా రెండుగా చీలిపొయ్యిందని ట్రెక్కింగుకొచ్చినాయనొకడు చెప్పినాడు. యీ సన్నంగా వుండే సందు మాదిరి దోవలో రెండుపక్కలా ఫ్లాట్‌పారాల మాదిరిగా బండలు పైకి తేలుండాయి. అవిటికి మధ్యలో బార, రెండు బారల వెడల్పుతో నీళ్లు పైన్నించీ కిందికి పారతా వుండాయి. పొయినప్పుడూ, తిరుక్కోని వచ్చేటప్పుడూ మూడుతావుల్లో దోవలేదు. నీళ్లగుండాల్నే యీదుకోని దాటాల. యీతరానోళ్లను రబ్బరుటూబులకు కట్టి దారాల్తో ఆపక్కకు లాగినారు.

రెండు కొండల నడిమధ్యలో నడిచేటప్పుడు పైనెక్కడో వుండే ఆకాశం చీరపేలిక మాదిరిగా కనబడతాది. దానికింద పత్తిపూల రాశిమాదిరిగా వుండే మొబ్బులు గుణగుణా యేనుగుల మాదిరిగా కదలబారతాయి. చిత్తిరినెల పౌర్ణమి నాడు తిరణాలకు యిసికేస్తే రాలనంతమంది జనమొచ్చి యీ సన్నదోవనిండా నడస్తారంట! అప్పుడు వాళ్లకంతా ఆకాశంలో చెరుకుపెనెమంత పెద్దగా, గుండ్రంగా వుండే చంద్రుడు దీపం పడతాడంట!

పాపనాశినంనించీ అడవిలో వొంటిగా, మనుషుల పొడగూడా కనబడకుండా, పొడుగ్గా యెంత నడిచినా అయిపోకుండా వుండే దోవ, కొండశిలవ పాము మాదిరిగా అదోరకమైన అందంతో బయపెడతానే వుండాది. అయితే అందమూ, బయమూ కలిసిపొయిన అడివిదోవకంటే ప్రభావతి యవ్వారమే చానాగా జాడించి పారేస్తా వుండాది. గొర్రెల్ని మర్లేసుకోనొచ్చే గొల్లోడి మాదిరిగా సుబ్బరాయుడు మా యెనకాల్నే నడస్తా వుండాడు.

"యీ నీళ్లల్లో తామరపువ్వులునుంటే యెంతో బాగుణ్ను," అనింది ప్రభావతి.

"యెర్ర తామరపువులయితే యింకా చానా బాగుణ్ను," అని నవ్వినాడు రాజేషు.

"పారేనీళ్లల్లో తామరతీగలు బతకవు. చెరువుల్లోనో, కోనేర్లల్లోనో మాత్రమే తామరపూలుంటాయి," అని రమణ ముఖాన్ని యెర్రంగా జేసుకున్నాడు.

సరిగ్గా అప్పుడే నేను, "జలజలా పారే యీ నీళ్లల్లో వుండే జలపుష్పాలు తామరపూలకంటే అందంగాలేవా?" అని అడ్డం మాట్లాడతా గుండుపైన్నించీ

అంతర్మధ్యంలోకి అడుగేసినాను. అదంతా రెండే నిమషాల్లో జరిగిపోయిందని సుబ్బరాయుడు చెప్పినాడు. గుండ్రాయి మాదిరిగా బండలపైన దొర్లుకుంటా పోయి నీళ్లగుంటలో తాడు తెగిన బొక్కిన మాదిరిగా మునిగిపోయినానని చెప్పినాడు.

ఆరాత్రి నన్ను తరిగొండామె గెవిలో అటకపైకెక్కించేటప్పుడు, "కోతి పెరికి పారేసినప్పుడు చెట్టుపైన్నించీ కిందికిపడే యెలక్కాయ మాదిరిగా దొర్లినావు," అని చెప్పినాడు రాజేషు.

"అదేంగాదు, దారందెగిన గాలిపటం మాదిరిగా గాల్లోనే యిసరక పోయినావు," అనినాడు రమణ.

"అయ్యోపాపం! కాలుకు దెబ్బ బలంగా తగిలినట్టుండాది. లేచి నడస్తాడా, లేదా?" అని ప్రభావతి మాత్రమే నేను పడిపోయి సుట్రకపోయినప్పుడు యేడవ బొయ్యింది. ఆమె ఆమాట అంటానే నేను నా కాలు కదపబొయినాను. చెరకుగానిగ చక్రంలో యిరుక్కున్నట్టుగా, కొమ్మనుకోని యెవురో గొడ్డలితో నా కాలిపైన దెబ్బేసినట్టుగా, మోకాలి కింద అగ్గిపెట్టినట్టుగా, నా కాలు మండిపోయింది.

"పైన బొంతగెద్దలెగరతా వుండాయి. మనంగానిక్కడ లేకపొయ్యుంటే అవి అట్నే కిందికి దిగి, నీళ్లపైన్నే యెగరతా గోర్లతో, ముక్కుల్తో చేపల్ని జవురుకోని పొయ్యుంటాయి..."

సుబ్బరాయుడి మాటలు చెవినబడినప్పుడు నీరసంగా కండ్లు దెరిసినాను.

నా చుట్టూరా నిలబడి, వొంగి నన్నే చూస్తా వుండే వాళ్లు కనబడంగానే, అంత నొప్పిలో గూడా నాకు సిగ్గొచ్చింది. అప్పటికే నన్ను గుంటలోనించీ బయిటికి లాక్కొనొచ్చిన సుబ్బరాయుడు నిలువునా తడిసిపొయ్యుండాడు. వాడు నీళ్లల్లోకి దూకి నన్ను పట్టుకోని లాగినప్పుడు, 'నొప్పిరా నొప్పి,' అని ఆకాశం యిరిగి పడేటట్టుగా అరిచినానని సుబ్బరాయుడు ఆ తరువాత చెప్పినాడు.

మొండికేసిన సొరచేపను గడ్డనేసినట్టుగా, సుబ్బరాయుడు నన్ను పట్ల బలంతాన బండపైకి లాక్కొనొచ్చినాక గూడా నాకు చానాసేపు మాటల్రాలేదని ప్రభావతి చెప్పింది. కొంచెం స్మారకమొచ్చినాంక, చేతుల్ని యెనక్కువాల్చి, దబ్బున పైకి లేవాలని చూసినాననీ, ముల్లుగర్రతో గుచ్చినాపైకి లెయ్యని యెనుంగొడ్డు మాదిరిగా నా కాలు కదలకపోవాటంతో, 'అబ్బబ్బా! నొప్పి,' అని అరిచినాననీ వాళ్లే చెప్పినారు.

"కాలేమైనా బెణికిందేమో చూద్దాం, ముందుకు చాపన్నా!" అని సుబ్బరాయుడు నా కాలుపట్టి ముందుకు లాగబొయినాడు.

"నొప్పిరా, లాగద్దు... లాగద్దు," అని మళ్లా అరిచినాను. యెంత గెట్టిగా అరిచినానో తెలవదుగానీ, పక్కన కొండపేటు సందుల్లో నించీ రెండు తోకపిట్టలు రెక్కలు గొట్టుకుంటా నా పైన్నించే యెగిరిపొయినాయి.

“కాలు యిరిగినట్టే వుండాది. నడవలేకపోతే యిప్పుడేంగతి? యిప్పటికే మనం మిగిలినోళ్లకంటే యెనకబడిపొయినాం. మొబ్బుగాకముందే పాపనాశినం జేరకపోతే యీ అడివిలోనే చిగలకపోతాం!” రాజేష్ గొంతు వణకతా వుండాది.

“కొంచెం యెనకాముందూ చూసుకోని నడవాలగదా! నర్సింహులు తెల్లారే యెచ్చరించినాడు నిన్ను...” ప్రభావతి యేడవబోయింది. నాకోసరం ఆమె తల్లడిల్లి పోతా వుండేది చూడంగానే నాకు సంతోషం ముంచుకొచ్చింది.

“చూస్తా కుచ్చుంటే జరిగేదేంలేదు. ముందా అన్నను మీరు పట్టుకోండి. తరిగొండామె గెవిదాకా జేరిస్తే మల్లంకేం జెయ్యాల్నో ఆలోసిద్దాం,” అంటా సుబ్బరాయుడు నా జబ్బ పట్టుకోని పైకెత్తినాడు.

తరిగొండ వెంగమమ్మ గుహ పేరు వింటానే నా గుండెలు డబడబా కొట్టుకున్నాయి. ఆ గుహలోనే యీ రెయ్యంతా వుండాల్సిందేమోననుకోని అదిరిపొయినాను.

## 2

కొండ ముందరుండే గుహ పెద్ద రాక్షసుడెవుడో తెరిచిన నోరు మాదిరిగా బీభత్సంగా వుండాది. కోరల మాదిరిగా బండలు పైకి లేచుండాయి. గుహ ముందరుండే బండపైన నన్ను దించినాంక వాళ్లు ముగ్గురూ గసలుబోస్తా నిలబడు కున్నారు.

వొకపక్క సుబ్బరాయుడు, యింగోపక్క రాజేషూ, రమణా మార్చి మార్చి నా భుజాల కింద చేతులేసుకోని యింత దూరమూ మోసుకోనొచ్చినారు. వాళ్ల భుజాల పైన చేతులేసుకోని, నొప్పితో తనకలాడిస్తా వుండే కాలును మడిచిపెట్టుకోని, వొంటికాలితో కుంటుకుంటా వచ్చుండాను. అప్పుడప్పుడూ నా భుజంపైన చెయ్యేసి పక్కన మోస్తావుండేటోడికి సహాయం చెయ్యాలని చూసింది ప్రభావతి.

కొండల నడిమధ్యనుండే దోవను దాటుకోని, దోవ ముందరుండే నీళ్ల మడుగు చుట్లా తిరిగి తరిగొండామె గుహ దగ్గిరికి చేరుండాము.

యెండ పడమరకు దిగిపొయ్యుండాది. నీడలు పొడుగ్గా సాగతా వుండాయి. పక్కన్నే పారతావుండే కాలవలో నీళ్లు సొళసొళమంటా వుండాయి.

కాలును కదల్చకుండా పెట్టుకుంటే నొప్పి తక్కవగా వుండాది. కొంచెం కదిలించినానంటే మొసలేదో రంపంపండ్లతో కొరకతా వున్నట్లుగా మండిపోతా వుండాది.

“మనోళ్లు సగం దోవ దాటేసుంటారు,” అని గొణిగినాడు రాజేషు.

“వాడింక నడవలేడు. యీ రేత్రికి మనం యిక్కడ చిగులుకోని పొయినట్లేనా?” అన్నాడు రమణ గొంతులో యేడుపు తన్నుకొస్తా వుండంగా.

“అడివిలో రేత్రిపూట ఆడకూతురుండేది మంచిదిగాదు. మీరు ముగ్గురూ యెలబారిపోండి. నేనన్న దగ్గిర్నే వుంటా,” అనినాడు సుబ్బరాయుడు.

యిదే సుబ్బరాయుడు పొద్దన తుంబురు తీర్దానికి పోతావుండేటప్పుడు, యిదే గుహను చూపించి, “యీగెవిలోనే ఆ పున్యాత్ముఁరాలు పన్నెండేండ్లు తబస్సు చేసింది. యిప్పుడాయకట్టుగా ఆ దినాల్లో యీ దోవ కూడా లేదు. యేం తినిందో, యేం గుడ్డ గట్టిందో యెవుడికి దెలుసు? యిప్పుడు పగుల్లోనే యీపక్క నరపురుగు మెసలడు,” అని చెప్పినాడు.

యిప్పుడదే సుబ్బరాయుడు బిక్కమొగాలేసుకోనుండే ముగ్గుర్నీజూసి “యెందుకైనా మంచిది, యీ అన్నను ఆగెవిలోవుండే అటవపైకి జేర్పిద్దాం పట్టండి. నేనొక్కడ్నీ ఆ పనిజెయ్యలేను,” అనినాడు.

రాజేషు గుహ లోపలికి తొంగి చూసి, “అటవంటే ఆ పైనుండేదే గదా? అంత పైకి యింత మనిషినెట్ల యెత్తిపెట్టేదానికయితింది?” అని అడిగినాడు.

సుబ్బరాయుడు దుప్పల్లోనించీ నాలుగడుగుల పొడుగుండే కట్టెనొకదాన్ని యెతికి పట్టుకున్నాంక, “ఆ అటవపైన్నే పెద్ద తమరకొయ్యను పెట్టుంటారన్నా! యీ కొయ్యతో దాన్నెట్లయినా పట్టి కిందికి లాక్కోవాల. దాన్ని నిచ్చెనమాదిరిగా యేసుకోని పైకెక్కతారు. యెక్కినాక ఆ తమరకొయ్యను పైకి లాగేసుకోవాల. రాత్రుల్లో వొంటిగా వుండాల్సొస్తే అక్కడట్నే పండుకోవాల. అప్పుడీ గెవిలోకి మెకాలూ, పాములూ వచ్చినా భయిం వుండదు,” అనినాడు.

ఆపక్కా యీపక్కా వుండే కొమ్మల్ని మూరెడు యిడిసిపెట్టి కొట్టి పారేయడంతో ఆ కొమ్మ భారతంమిట్ట దగ్గిర అర్జునుడు వేషం గట్టేటోడు యెక్కే తబుసుమాను మాదిరుండాది. ఆ కొమ్మల్ని పట్టుకోని అటవ పైకెక్కినాక, “మీరిద్దరూ అలాగ్గా ఆయన్నను పైకెత్తి నాకందించండి. నేనాయిన చేతుల్ని పట్టుకోని పైకి లాక్కుంటాను,” అనినాడు సుబ్బరాయుడు.

ప్రభావతి కండ్లింతంత జేసుకోని చూస్తా వుండంగా నన్ను రమణ రాజేషులుతో గలిసి సుబ్బరాయుడు ఆరడుగుల యెత్తులో వుండే అటక పైకి చేరేసినాంక వాళ్లా పనెట్ల జేసినారో తలుచుకుంటేనే ఆశ్చర్యంగా వుండాది. ముందుగా రమణా రాజేషూ నన్ను చింతకాయల మూటను పైకెత్తినట్టుగా రెండు చేతులూ అబ్బిలించి పట్టుకోని పైకెత్తినారు. తమరకట్టె కొమ్మపైనొక కాలూ, అటకపైనొక కాలూ పెట్టుకోని, నా రెండు చేతులూ పట్టుకోని సుబ్బరాయుడు నన్నుపైకి లాక్కున్నాడు. వాళ్లాపనిజేసినంతసేపూ నా యెడమకాలు ముండ్లకీల్లో తగలకపాయినట్టుగా మండిపాయింది. ఆలగోడు బాలగోడుగా నేను అరస్తా వుంటే గూడా పట్టించు కోకుండా వాళ్లు వాళ్ల పని చేసుకుపాయినారు.

గుహ లోపలికి రెండు బారల దూరం పోతానే వుత్తరంగా వుండే గోడకు ఆరేడడుగుల యెత్తులో పెద్దరాయి చదరంగా ముందుకు చొచ్చుకోనొచ్చుండాది. దానిపైన వొక మనిషి పండుకునేదానికి సరిపొయినంత తావుండాది. దానిపైకెక్కి పండుకున్నాంక దాన్నేనా అందురూ అటవని పిలిచిందని యిచిత్రకపొయినాను.

అటవపైకొచ్చి గోడ మాదిరుండే రాయికి ఆనుకోని నడుం చేరేసినాక, వొకసారి గుహనంతా బయింబయింగా చూసినాను. పెద్దబండను పగలగొట్టి చేసినట్టుగా గుహగోడలూ, పైకప్పు అంతా బండలే వుండాయి. గుహకా చివర్లో నోట్లో వుండే అంగుటి మాదిరిగా లోపలికి పొయ్యే దీగుడుమాదిరుండే చిన్న దోవుండాది. దానిలోపల యేముండాదో కనబడలేదు. దానికి రెండుబారల దూరంలో గోడకు మూరెడు పొడుగుండే రెండు రాళ్లనానించుండారు. అవిటిపైన వెలిసి పొయ్యుండే తెల్లగీతల్ని జూసినాక అవి దేవుడు శిలలై వుండాలనీ, వాటికీ నడమలో పూజాగీజా జరగలేదనీ తెలస్తా వుండాది. గుహ నేలపైన వొక్కలముక్కలుగా వుండే బండలుండే తావులో రాళ్లూ, కుండపెంకులూ చెల్లాచెదురుగా పడుండాయి. యీ నడమెప్పుడూ యీ గుహలోపల మనుషులు గడిసేపయినా వున్నట్టు ఆచూకీ లేదు. అటక పైన్నుంచీ గుహ బయటుండే బండరాయీ, దానియెనకుండే తీంట్రతీగల పొదలూ, వాటెనకుండే మద్దిమాను మొదులూ మాత్రమే అగుపడతా వుండాయి.

"పాపనాశినం జేరతానే అక్కడుండే మావోళ్లకు నా సంగతి చెవినెయ్యండి. అట్నే ఫారెస్టాయినకు గూడా వొకమాట జెప్పండి. తెల్లారీ తెల్లారక ముందర్నే మనషుల్ని అంపీమనండి. యీ అన్నను మద్దానానికైనా ఆడికిజేరిస్తే, ఆడ్నించీ జీబులోనో దేంట్లోనో ఆస్పత్రికి తోలకపోవచ్చు..." అనినాడు సుబ్బరాయడు.

"నేనైనా యీ దోవలో వచ్చింది మూడుతూర్లే! చీకటిబడిందంటే దోవ దప్పోతామేమోనని బయింగా వుండాది. బిన్నాయెలబారండి," రమణ తొందరబడినాడు.

"అయ్యో! ఆయిన్నిట్లా యిక్కడిడిసిపెట్టేసి..." ప్రభావతి నసగతానే కదలబారింది.

"భద్రంరా మీరిద్దురూ! పాపనాశనం జేరతానే నిన్ను యెత్తుకోనొచ్చే యేర్పాటు జేస్తాను" అంటానే రాజేషు కూడా గుహ బయటికి పొయినాడు.

దోవలో వాళ్లు నడిచిపోతా వుండే శబ్దం అంతకంతకూ యెనక్కుపొయింది. కాలవలో నీళ్లు పారతా వుండే శబ్దం జలజలమని మెల్లింగా యినబడతా వుండాది.

అటవకెదురుగా దిన్నెమాదిరుండే బండపైన గుచ్చున్నాక చొక్కాయి జేబులోనించీ బీడీకట్టను పైకెత్తుకోని, "అదురుష్టమంటే యిదీ! కట్టబీడీలట్నే వుండాయి. యీరెయ్యి బయింలేదు," అంటా వొక బీడీని అగ్గిపుల్లతో రగిలించినాడు

సుబ్బరాయుడు. అప్పుడే మొదుటితూరి జూసినట్టుగా సుబ్బరాయుడ్ని కళ్లార్పకుండా చూసినాను. నలభైనించీ యాభైదాకా ఆ మనిషి వొయిసెంతయినా గావచ్చు. వుమ్మెత్త కాయలా వుండే ముగం. పగిలిన జిల్లేడుకాయ మాదిరిగా జుత్తు. యీ అడివి మనషులుకు యిద్దురు ముగ్గురు పెండ్లాలుంటారని యిన్నాను. బిడ్డలెందురో తెలవదు. యిప్పుడా మనిషికా సంసారమూ, ఆ జంజాటమూ గెవనమే వుండేట్టు లేదు. అడివిలోనే పుట్టి, యీ తావులోనే పెరిగి పెద్దోడైనట్టుగా యేదీ పట్టకుండా కుర్చోనుండాడు.

"అట్లా రెండడుగులు సాగేసి వస్తానుండన్నా! యీపక్కన బంగాకుండాల. దొరికితే యీరేత్రికి నీకూ నాకూ పండగే!" అంటా పైకిలేచి చక్కా బయిటికెళ్లి పొయినాడు సుబ్బరాయుడు.

యిప్పుడీ గుహలో నేను తప్ప యింగో నరపురుగు లేడు. సుబ్బరాయుడికీ అడివంతా కొట్టిన పిండి. యెంత దూరం పొయినాడో తెలవదు. సరిగ్గా అప్పుడే నాకు పొద్దన యీదోవలో పోతా పోతా నర్సింములు జెప్పిన సంగతి గెవనానికొచ్చింది.

యిరవై ముప్పయి సమత్సరాలకు ముందు, యిదే గుహలో వొక బిత్తలమొల సన్యాసున్నాడంట. యిట్లా తీర్తానికొచ్చినోళ్లూ, పారెస్టోళ్లూ తెచ్చే తిండితిని, అది దొరక నప్పుడు ఆకులూ అలుములూ తిని బతికినాడంట. రాత్రుల్లో యిదే అటవ పైకెక్కి పండుకోని పులులకూ, యెలుంగొడ్లకూ దొరక్కుండా చెలాయించినాడంట! అయితే కొందురు అడివోళ్లకు ఆ సన్యాసి దగ్గిర చానా లిబ్బుండాదని అనమానం వచ్చిందంట! అంతే! వొకనాడు రేత్రి ఆయిన గొంతు పిసికి పారేసి గుహనంతా తవ్వి పారేసిపొయినారంట! వాళ్లకేం దొరికిందో యెవురికీ తెలవదు. పారెస్టోళ్లు యీపక్కకొచ్చి చూసినప్పుడు పీనిగమాత్రం కుళ్లిపొయి గనబడిందంట! వాళ్లీపక్కనే ఆ మిగిలిన పీనిగను కాల్చిపోరేసి పొయినారంట!

ఆ అడివి మనుషులు యిప్పుడు కూడా యీ చుట్లా తిరగతా వుండారేమో! నా పాంటుజేబులో వుండే పర్సులో రెండు అయిదునూర్ల నోట్లూ, కొంచెం చిల్లరా వుండాది. నా చేతికుండే గడియారాన్ని దొంగ చేతికిచ్చినా మూడు నూర్లయినా దొరకతాది. ఆమాత్రం దానికైనా తెగాయించే మనుషులుండకపోరు.

బయటనించీ గాలి యిసరకొస్తా వుండాది. అయినా నాకు బయింతో చెమటలు పోసేసినాయి. బంగాకు కోసరం పొయిన సుబ్బరాయుడు యేమయినాడో తెలవదు. పైకి లెయ్యబొయి, కాలునొప్పితో లాగ్గానే, మళ్లా అటవగోడకు అతుక్కున్నాను.

కట్టను తెంపుకొనొచ్చే కాటికనీళ్లమాదిరిగా మొబ్బు గుహలోపలికి ముంచుకో నొస్తా వుండాది. గుహగూడు దగ్గిర టక్కుటక్కుమంటావుండాదేందో. పురుగో, పిట్టో,

పామో తెలవదు. గుహముందరేందో టపటపా యిరగతా వుండాది. కొమ్మో, కాయో, మెకమో తెలవదు. తమరకొయ్య నా యీపుకు గుచ్చుకుంటా వుండాది. పక్కకుతోస్తే అదికిందికి పడిపోతింది. నా గుండె డబడబా కొట్టుకుంటా వుండాది. శబ్దాలేమీ యినబడనప్పుడు నా చేతి గడియారంలో ముండ్లు తిరిగే శబ్దం యికారంగా యినబడతా వుండాది.

నేనీ అటవ పైనుండేది మాత్రమే నిజమనీ, అంతకుముందు బతికిన బతుకంతా కల మాత్రమేననీ అనిపిస్తా వుండాది. నీళ్లతొట్టిలో పడిన పుచ్చుగింజ మునగలేక మునిగినట్టుగా ప్రతిక్షణమూ భారంగా కదలతా వుండాది.

“అన్నోవ్! అన్నోవ్!”

చానాసేపయినాంక సుబ్బరాయుడు గొంతినబడింది. దట్టమైపొయిన చిమ్మచీకట్లో వాని బీడీ మాత్రం యెర్రెర్రంగా గనబడతా వుండాది.

“అటవపైన సోపుదారి మాదిరిగా జమ్మనికొలువు జేస్తావుండావు గదా నా పాసుగూలా! యిదింద. వులింజిపండ్లు. కడుపునిండా తోసెయ్యి. యీరేత్రికిదే నీ భోజినం...” అంటా సుబ్బరాయుడు జోబీలనిండా పోసుకొచ్చిన పండ్లను పిడికిల్లు పిడికిల్లుగా తీసి నా పక్కను పోసినాడు. వాని మాటలింటా వుంటే బంగాకు దొరికినట్టే వుండాది.

వులింజపండ్లు పచ్చిపచ్చిగా వుండాయి. వొగురుతో నాలిక గయ్యిమనింది.

సుబ్బరాయుడు రాతిదిన్నె పైన కుర్చోని కూనిరాగమేందో తీస్తా వుండాడు. దఢేలుమని బయిట్నించీ అరుపులు యినబడినాయి. అడివిపిల్లులో, కోతులో, కుందేల్లో, కణుతులో దబదబా పరిగెత్తతా వుండాయి. కుయ్యికయ్యిమని చిన్నబిడ్డేదో యేడ్చినట్టుండే అరుపులు. పడుకోబోతా వుండే సుబ్బరాయుడు తువ్వాలు తీసి భుజానేసుకోని, యెవురో పిలిచినట్టుగా, తూలుకుంటా బయటికి పరిగెత్తినాడు.

## 3

కండ్లు పొడుచుకోని చూసినా ఆ మొబ్బులో యేమీ అగుపడ్డంలేదు. అడివంతా కరదవైపోయి, ఆ కరదవ గుహనంతా ముంచేసినట్టుగా యే పక్కకు తిరిగినా అదే చీకటి.

మిణుగురు పురుగొకటి మెరస్తా గుహలోపల తెల్లగీతలు గీస్తా తిరగతా వుండాది. అదిరాక పొయ్యుంటే నాకు గుడ్డొచ్చేసిందనే అనుకోనుంటాను.

బయిట చీకిరాళ్లు జీరంగుల మాదిరిగా గయ్యిమంటా వుండాయి. చేతికి గడియారముండినా టయిమెంతయిందో తెలవటం లేదు.

వున్నట్టుండి గుహగోడలపైనేదో పడి పగిలిపొయినట్టుగా చప్పుడయింది. యెమ్మటెమ్మట్నే యింగో నాలుగైదు రాళ్లొచ్చి గోడలకు తగిలినాయి. ఆ రాళ్ల

పగిలినప్పుడంతా చిటపటమని కణకణమని అగ్గికణికలు సురసురొత్తుల మాదిరిగా వెలిగినాయి. యెవురో తోసినట్టుగా బయింతో అటవగోడకు అనుక్కునేసినాను.

రాళ్లు పగిలేది ఆగిపోయినాంక యెవురో గుహలోపల అడుగులేస్తా వుండారని పించింది. చీకట్లోకి యెగిరొచ్చే గబ్బిలం మాదిరిగా గుహలోపలికి నల్లనీడేదో వచ్చినట్టు అనమానం వచ్చింది. యెవురో గెట్టిగా వూపిరితీసి వొదలతా వుండారని మాత్రం తెలిసిపోయింది.

గుహ దీగుడు దగ్గిర రాళ్లూ, పెంకులూ కదలతా వుండే చప్పుడయింది. రెండు రాళ్లు గట్టిగా ఢీకొట్టుకున్నట్టుగా ఫెడీల్మనినాయి. జుయ్యిమని వెలుతురు పుట్టింది. యేందో గుడ్డగాలిన వాసన. గుహగూడు ముందు గన్నేరుమొగ్గ మాదిరుండే దీపం వెలిగింది. తెల్ల చీటీగుడ్డ పైన బురదనీళ్ల మరకలు తేపలు తేపలుగా పాకినట్టుగా దీపం చుట్టూరా యెలుతుర్లు సాగబారినాయి. ఆ గుడ్డి యెలుతురులో దీపానికో బారెడు దూరంలో, చాకిరేవులో వుబకబాన దగ్గిర ముదరజుట్టిన గుడ్డల మూట మాదిరి ఆకారం కనబడింది. ఆ ఆకారం పైకిలేచి గుహ నోటిదాకా సాగొచ్చింది. అట్లా నడిచేది మనిషి మాత్రం కాదనిపించింది. అది యెలుంగుడ్డో, పెద్ద కోతో అయ్యుండచ్చుననుకున్నాను. వొకతూరి పిచ్చిగుంట్లోడొక్కడు వూర్లోకి పట్టుకోనొచ్చినప్పుడు మాత్రమే నేను యెలుంగొడ్డును చూసుండాను. అవి మనుషుల్ని అబ్బలించుకోని నలిపి పారేస్తాయనీ, మొగవయితే మడుసుల్నే ఆడయెలుంగొడ్డులనుకోని యేమేమో చేస్తాయనీ మా సావాసకాపులు చెప్పిన సంగతి గ్నాపకం వచ్చింది. బయింతో నా గుండెలవిసిపోయినాయి.

అడివి చీకట్లోంచీ తునిగిపడిపోయిన తోకమాదిరిగా ఆ ఆకారం మళ్లా దీపం దగ్గిరికి పొయి కూర్చునింది. దీపంపక్క యింకో మంట పుట్టింది. దానిపైకొక ముంతెక్కింది. మూడరాళ్ల పొయ్యిపైన యేందో వుడకబోతా వుండాదని అర్దమయింది. అప్పటిగ్గానీ నాకాడ కుచ్చోనుండేది మనిషేననే నమ్మకం కుదర్లేదు. ఆ మంటలడాలులో కాళ్లు చాపుకోని ఆ మనిషి యేందో నమలతా వుండే శబ్దం యినబడింది.

కొంచేపయినాక ఆ ఆకారం, “యేయ్! యెవుర్రా నువ్వు? యేం కావాల నీకు?” అని పెద్దగా కసిరింది. ఆ గొంతు యినబడినాకగానీ అక్కడుండేది మొగమనిషేనని నాకు నమ్మకం రాలేదు. అయితే ఆ మాట్లాడింది నాతోనే అనుకోని బెదిరిపోతా గోడకు అతుక్కున్నాను.

యింకొంచేపయినాక దీపం ముందుండే మనిషి, “నువ్వా? యీ మొబ్బులో మనిషనుకుంటిని గదరా బాడకోవ్! పిల్లిమాదిరిగా సద్దూగిద్దూ లేకుండా యెట్లొచ్చి దర్జాగా గుచ్చోనుండావు రానీయమ్మా! యీడ లిబ్బేందాంచి పెట్టుకోనుండావు?

యింద... యిది మింగు,'' అనినాడు. ఆ మనిషి దగ్గిర్నించీ గుహ నోటిదాకా యేదో యెగిరొచ్చిపడింది.

గుహలోమండతా వుండే రెండు గుడ్డి యెలుతుర్లలో, గుహ ముందరుండే బండ పైన, కూలిపోయిన గరిసెమాదిరుండే జీవం గనబడింది. అంతవరకూ చప్పుడు చెయ్యకుండా వుండిపోయిన ఆ జీవం పెద్దగా శబ్దమొచ్చేటట్టు యేందో తింటా వుండాది.

''బెల్లం బాగుండాదారా! యింద, యింకో పెళ్లగూడా నమిలెయ్యి...'' అనినాడు పొయ్యిముందరుండే మనిషి. ఆ మనిషి పైకిలేస్తానే యెనకాలుండే మూరెడు పొడుగు జుత్తూ, ముందరుండే రెండుమూర్ల గెడ్డమూ మసిపేలికల మాదిరిగా వూగినాయి.

''నా తిండి పొయ్యిపైన వుడకతా వుండాది. మీ యెలుంగొడ్డులకా సప్పిడి కూడేం సగిస్తాది. నీ పలహారం బయటుండాది. తెస్తానుండు...'' అని పెద్దగా చేతులు తిప్పుతూ ఆగెడ్డమాయిన ఆ జీవం ముందునించీ గుహ బయటికి నడిచిపోయినాడు.

## 4

గెడ్డమాయినెంత దూరం పొయినాడో తెలవదు.

గుహ ముందర యెలుంగొడ్డు నోరు చప్పరిస్తా కుచ్చోనుండాది.

అటవమింద వూపిరి కూడా గెట్టిగా పీల్చుకునేదానికి బయిపడతా వుండాన్నేను. మినుగురు పురుగుల గుంపొకటి గుహ ముందుదాకా వచ్చి తర్వాత అట్నే యెనక్కు మల్లుకోని పొయినాయి.

గుహగూడు దగ్గిర సరసరమని చప్పుడవతా వుండాది.

చీకట్లోకి కండ్లు మిటకరించి చూస్తా వుండాను.

''భలే అదురుష్టం రా నీకు!'' చానాసేపయినాక గెడ్డమాయిన గొంతు యినబడింది. ''రెండు దొరికితే చాలనుకుంటే నాలుగు దొరికినాయి. కాలవపక్క రాయిని జరిపితే గుణగుణమని పైకొచ్చినాయి. వొకొక్క యెండ్రకాయీ అరిచేతెడం వుండాది. పండగ జేసుకో.''

గెడ్డమాయిన యెలుంగొడ్డు ముందర మూకుడు తిరగేసినాడు. మరు నిమషంలో యెండ్రకాయల యెముకలు యెలుంగొడ్డు పండ్ల కింద పరపరమని యిరిగిపోతా వుండాయి.

గెడ్డమాయిన పొయ్యిపైన వుడకతా వుండే సట్టి దగ్గిరికొచ్చి గొంతు క్కూచున్నాడు.

నాలుగు యెండ్రకాయల్ని నాలుగేనిమషాల్లో తిని తేన్చేసిన యెలుంగొడ్డు పైకి లేసి గుహ లోపలికి రెండడుగులేసింది. అయితే అక్కడ్నే నిలబడిపోయి

ముక్కుల్నిపైకెత్తి పెద్దగా గాలిపీల్చింది. అటక కిందిదాకా వచ్చి రెండు చేతులూ పైకెత్తి గుయ్యిగుయ్యిమని అరిచింది.

"యేందిరా నీయమ్మా నీ ఆగిత్యం! యేముండాదాడ?" అని అడగతా మండతా వుండే కొరివిని దివిటీమాదిరిగా పైకెత్తుకోని చరచరా నడిచొచ్చేసినాడు గెడ్డమాయిన. నేను కంటబడంగానే "యెవుడ్రా ఆడ? యెప్పుడు పైకెగబాకుండావు? యేంజేస్తా వుండావు? నా దగ్గర కత్తులూ బిచువాలూ వుండాయి. కిందికి దిగు యెవుడేందో తేల్చుకుందారి," అని పెద్దగా అరిచినాడు.

"అరవద్దు సామీ అరవద్దు! నేను దొంగగాదు. మాది మామండూరు పక్కనుండే పులిత్తలబయిలు. నాకాలిరిగింది. తిరుక్కోని పోలేకపాయినాను. మా వోళ్లు నన్నీ అటకమీదెక్కించేసి పాయినారు. తుంబురుతీర్దం చూసేదానికని పొద్దన వచ్చినోళ్లం. తిరుగుబాటలో కాలుజారి పడిపాయినాను. నాతోకూడా వుండి పాయినోడు, సుబ్బరాయుడు, అప్పుడెప్పుడో అడివిలోకి పాయినాడు." యేది ముందు చెప్పాల్నో, యేది యెనకాల చెప్పాల్నో తెలవకుండా నోటికేదొస్తే అది చెప్పినాను. నా అరుపులకు యెలుంగొడ్డు గూడా చప్పుడు చెయ్యకుండా రాతికూసం మాదిరిగా నిలబడిపాయింది.

"గెవిలోపలికి నేను రాల్లిసిరినప్పుడైనా పలికుండాల గదా? తమరకొయ్య నెతుక్కుంటా యీపక్కకొచ్చినప్పుడైనా నువ్వు పలకరించుండాల గదా? నిజింగానే కాలిరిగిందా, లేకపోతే దొంగెత్తేస్తా వుండావా?" గెడ్డమాయిన నిలదీసినాడు.

"యీ మొబ్బులో నువ్వీపక్కకెప్పుడొచ్చినావో నాకు కనపడ్లేదు సామీ! నువ్వక్కడ దీపం ముట్టించినాంకే నిన్ను తొలీగా జూసినాను. పలకరిద్దామనుకుంటా వుండంగా యీ యెలుంగొడ్డొచ్చి నన్ను అడులుగొట్టేసింది. బయింతో నోరెండక పొయి వనకతా వుండాను," అని పెద్దగా యేడవబొయినాను.

ఆయినకొంచేపు కొరివికట్టె వెలుతుర్లో నన్నట్నే చూస్తా నిలబడిపాయినాడు. ఆపైన పెద్దగా నిట్టూర్చినాడు. "సరిసర్లే! యేమైనా తిన్నావా, లేకపోతే పస్తుపండుకో నుండావా? పొయ్యి పైన వుడకతా వుండే పులగం నాకే సరిపోదు." అంటా మళ్లా పాయి పొయ్యిగడ్డ పక్కన కుచ్చున్నాడు. పక్కనుండే తిత్తిలోనించీ చిన్నపొట్లం తీసి, కొంచెం అరిచేతిలో పోసుకోని, "యిందరా వుప్పు.. వచ్చిగతుకు" అని యెలుంగొడ్డును పిలిచినాడు. అది రెండు కాళ్లతో గుణగుణా యిసరకపాయినట్టుగా పొయి, ఆయిన చేతిలో వుండే పొడినంతా జవురుకోని, నోట్లో పోసుకోని, గెట్టిగా చప్పరిం చేసింది.

"నీ వుపద్రం కూలా! గోర్లతో నా అరిచెయ్యిని కుల్లగించి పారేస్తివి గదరా నీయక్కా! చెర్మం చీరక పొయి రగతమొచ్చేసింది. మంచీ చెడ్డా యిరతం పరతం దెలవని జల్మంరా నీది," గెడ్డమాయిన పెద్దగా గొంతెత్తి నవ్వినాడు.

ఆయనకు జబాబు చెప్పినట్టుగా యెలుంగొడ్డు బుసగొట్టింది. గెడ్డమాయిన అదేమాదిరి బుసగొట్టినాడు. అది తుమ్మింది. ఆయినగూడా అదేరకంగా తుమ్మినాడు. అది నాలుగుకాళ్ల పైన నిలబడి అట్లా యిట్లా వూగింది. ఆయినా చేతుల్ని నేలపైన మోపుకోని దానిమాదిరే వూగినాడు. అది గుర్రుగుర్రుమని అరిచింది. ఆయినా అదేమాదిరిగా గుర్రుగుర్రుమన్నాడు. వాళ్లిద్దురూ ఆమాదిరి ఆడతా వుంటే నేను బిత్తరకపోయి చూస్తా వుండిపోయినాను.

''వుండుంర్రా నీ వుపాతకం కూలా! నీతో యెగరతా వుండి పొయ్యి పైనుండేదాన్ని మర్సిపోయినాను. అది చిమిడే పొయ్యుంటాది,'' అంటా గెడ్డమాయిన పొయ్యిపైన వుడకతా వుండే కుండలో కట్టెపుల్ల పెట్టి కెలికినాడు.

అంతవరకూ ఆడతా వుండిన యెలుంగొడ్డు గెడ్డమాయిన చెయ్యిపట్టుకోని లాగింది.

''వుండుంర్రా! వుండు వుండూ,'' అంటా ఆయిన దాని చేతల్లోనించీ చెయ్యి లాక్కునే దానికి చూసినాడు.

యెలుంగొడ్డు గుర్రుగుర్రుమని అరస్తా చేతుల్ని యెనక్కు చాపింది.

''నీ ముడ్డి జూపిస్తా వుండావేందిరా ముట్టాల్! ఆడేముండాది నీకు? గొమ్ముగా పండుకో అయితే చూద్దాం,'' అని గెడ్డమాయిన కసిరినాడు. కొంచే పయినాక ''యిట్లాగాదుండు. నేను పనుకుంటాను,'' అని పొయ్యిగడ్డ పక్కన్నే యెల్లికిలా పండుకున్నాడు. అప్పటికిగానీ అది అరిసేది ఆపలేదు. ఆయిన పక్కన్నే ఆయినమాదిరే యెల్లికిలా పండుకునింది. ఆయినకు రెండింతలు పొడుగూలావూ వుండాదది.

యెమ్మటన్నే గెడ్డమాయిన పైకిలేసి, మండే కొరివెత్తుకోని, దాని ముడ్డిపైన చెయ్యిపెట్టి కెలికినాడు. కొంచేపట్లా తడమాడినాక వొకచోట యెలుతురుపెట్టి చూసి ''అంత పెద్దపుండయి పొయ్యుండాదేందిరా? దాన్నిండా అడివిపేన్లేనే! యెంత నొప్పినెట్లా వోర్చుకోనుండావురా నీయమ్మా! నువ్వు గొమ్ముగా పండుకుంటేగానీ నేనేం జెయ్యలేను,'' అనినాడు. ఆయిన యీపుపైన నిమరతా వుంటే అది మూల్గతా పనుకునింది.

గెడ్డమాయిన మొలతాడుకు గట్టుకోనుండే పేనాకత్తిని తీసుకోని, కొరివి కట్టె యెలుతుర్లో పుండులోనించీ వొక పేను పైకి లాగినాడు. అడివంతా యెత్తకపొయ్యే టట్టుగా, యెవురో దాన్ని సావగొట్టినట్టుగా, అది గోరంగా గుర్రుమనింది. గడ్డమాయిన పేనాకత్తి పైనుండే పేనును దానిముక్కు దగ్గర పెట్టి, ''మూచ్చూర్రా నీయమ్మా! యెట్లుండాదోచూడీ పేను,'' అనినాడు. యెలుంగొడ్డు ముక్కులెగదీసినాక పేన్ను పొయ్యిలో యిదిలించినాడు. నిప్పులపైన పడంగానే అది చిటపటమని మండింది.

గెడ్డమాయినా మాదిరిగా దాని ముడ్డిపైన పుండులో వుండే పేన్లనంతా పేనాకత్తితో పీకి, ప్రతి పేనునూ దానికి వాసన జూపించి, మంటలోకి యిదిలించినాడు. ఆ పని జరిగినంతసేపూ అది గుహ కప్పు యిరిగి పైన పడేటట్టుగా గాండ్రిస్తానే వునింది. పేన్లన్నీ పీకి పారేసినాక గెడ్డమాయిన పేనాకత్తిని పొయ్యిమంటలో కాల్చి, పక్కనుండే గుండుపైన పెట్టినాడు.

అంతవరకూ ఆలగోడు బాలగోడుగా అరిచిన యెలుంగొడ్డు యేమీ జరగనట్టుగా పైకిలేసి, రెండు చేతుల్నీ వూపుకుంటా గెంతులేసింది. గెడ్డమాయిన గూడా దానితోగూడా యెగిరేదానికి మల్లుకున్నాడు.

యింకొంచేపయినాంక యెలుంగొడ్డు గెడ్డమాయిన చెయ్యిపట్టుకోని గుహ బయిటికి లాక్కోనిపోబోయింది.

"యాడికిరా నీయమ్మా! వుండరా నాబట్టా! నన్నుగూడా రెండు మెతుకులు మిడగనీరా వుపద్రం బట్టిన్నాకొడకా!" అని తిడతానే గడ్డమాయిన దాని యెనకాల యిసరకపోయినాడు.

## 5

కట్టెల్ని యెగదోసే వాళ్లెవురూ లేకపోవాటంతో పొయ్యిలో మంటారిపోయింది. అంతవరకూ యెర్రడాలు గొడతా వున్న నిప్పుపైన బూడిద పేరకపోయి, పొయ్యిగూడా మొబ్బులో కలిసిపొయ్యింది. దానికాపక్కనుండే ప్రమిదలో వుండే వొత్తిగూడా గుడ్డిగా వెలగతా వుండాది.

"వదల్రానీయక్కా! వుండుండురానీయమ్మా! ఆ చెట్టెందుకెక్కేస్తావుండావురా పాపీ! ఆడేముండాదిరా నీ బోసానం?" అని బయిట్నించీ గెడ్డమాయిన అరుపులు యినబడతా వుండాయి.

యెలుంగొడ్డు గుర్రు గుర్రుమంటానే వుండాది. చెట్టుకొమ్మలు పెళపెళా యిరగతా వుండాయి. గడ్డిగుముల్లో జీవాలేవో దవుడు దీస్తా వుండాయి. కొమ్మలపై నుండే బెళబాయిలు, పూరేడ్లూ, వుడతలూ, తొండాకిలు కాసర బీసరమని అరస్తా వుండాయి.

ఆకాశం యిరిగి కిందపడిపోయినట్టుగా పెద్ద శబ్దం వచ్చింది.

"జుంటీగల్రానీయమ్మా! అవిగాని గరిస్తే నేనీడ్నే గుంతలోకి పోవాల్సిందే!" అని అరుచుకుంటా గెడ్డమాయిన గుహ లోపలికి పరిగెత్తుకోనొచ్చేసినాడు.

"యేందిసామీ! యేం జరగతా వుండాదక్కడ?" యేడుపూ బయమూ కలిసిపోయిన నా గొంతు నాకే యిచిత్రంగా యినబడింది.

"జుంటీగల పట్టురా నాయినా! మాకాలమ్మగుట్టంతుండాది. యెప్పుడు జూసినాడో యేమో, పేన్ల నొప్పి తీసేస్తానే మాంతంగా చెట్టెక్కేసి దాన్ని దిగదోసేసి

నాడు. చెట్టు దిగి చట్టంగా కుచ్చోని నమిలీ నమలకుండా దాన్నంతా మింగేస్తా వుండాడు. నాలుగీగలు నాకంటించేసి పొయినాయి. పక్కన్నే కలబంద మట్టలు గనబడితే చిదిమేసి ఆ బంకంతా పూసుకున్నాను. లేకపోతేనా?'' అని గసబోసకుంటా అరిచినాంక, ''నా పక్కకీ తేనెగడ్డ యిసిరికొట్టినాడు. యిదంతా నేనొక్కడ్నీ తిన్లేను. నువ్వా కొంచెం తిను,'' అంటా రెండు అరిచేతుల యెడముండే తేనెగడ్డొకటి నా పక్కన పెట్టినాడు గెడ్డమాయిన.

దాన్ని బిత్తరపొయి చూస్తా, ''తేనెటీగలు దాన్ని కుట్టలేదా సామీ?'' అని అడిగినాను.

''మూతిపైనా చెవలపైన వాలుండే యీగల్ను తోలుకునేసినాడు. మిగిలిన తావుల్లో జుంటీగల కోరలు యెంత గుచ్చినా దిగబడవు. యెంత లేదన్నా నాలుగైదు మణుగుల తేనుంటాది. తేనెతోగూడా జుంటీగల్నీ, వాటి పురుగుల్నీ, మొత్తం పట్టునంతా జవురుకోని మింగేస్తా వుండాడు. వానిది కడుపుగాదు, కల్లూరుతూము. యీడికొచ్చే ముందర్నే రెండు మూడు పుట్టలనిండా వుండే చెదులు మెక్కేసే వచ్చుండాడు. యింకా కొంచెం చెదులు వాని మూతికతుక్కోనే వుండాది...'' అనినాడాయిన పెద్దగా నవ్వుకుంటా.

తేనె కారతా వుండే గడ్డనించి కొంచెం తుంచుకోని నోట్లో పెట్టుకున్నాంక, ''చెదులు పురుగుల్నా? అడివిలో వుండే పుట్టల్లో పాములుంటాయి గదా!'' అని అడిగినాను కండ్లు మిటకరిస్తా.

''యే పుట్టలో యేముంటాదో వానికి దెలిసినట్టుగా యిర్లోడికి కూడా తెలవదు. బాకుల మాదిరుండే చేతల్తో తవ్వి పారేసినాక, మిగిలిన పుట్టపైన మూతిపెట్టి యెగపీల్చినాడంటే లోపలుండే చెదులంతా యిసరకొచ్చి నోట్లో పడాల్సిందే!'' అనినాడు గెడ్డమాయిన. నాలిక చప్పిరిస్తా, ''భలే తియ్యంగా వుండాది గదా! అదంతా జుర్రెయ్యి... వాడంతా మింగేసినట్టుండాడు. అందుకే బయట సద్దుగిద్దూ లేదు,'' అంటా మళ్లా గుహ బయిటికి పొయినాడాయిన.

బయిట్నించీ గుర్రుగుర్రుమని యెలుగ్గొడ్డు అరుపులు. వొకటిగాదు నాలుగైదు యెలుంగొడ్ల అరుపులు. యెలుంగొడ్లు వొకదానిపైనొకటి పడినట్టుగా వొకటే అరుపులు. కొంచేపయినాక గెడ్డమాయిన యెవురో లోపలికి తోసినట్టుగా యిసరకొచ్చినాడు. అటవ దగ్గిరికొచ్చి రగస్సం చెప్పేటట్టుగా లోగొంతుతో, ''వాన్నెతుక్కుంటా వాని సంసారమంతా వచ్చేసుండాది. అవంతా నన్ను జూసి మొరుసుకుంటా వుండాయి. వాడు నన్ను లోపలికి తోసేసి వాటెనకాల బొయినాడు. అట్నే పోతాడో, లేకపోతే అవిట్నంపించేసినాంక మళ్లా నాకోసరం వస్తాడో తెలవదు. వాని పిర్రలపై నుండే పుండారిపొయినా, వాడు జల్మంలో నన్ను మరిసిపోడనుకో!...'' అంటా ముసిముసిగా నవ్వినాడు.

## 6

చీకిరాళ్లు నిలుకులేకుండా గుయ్యిగుయ్యిమని అరుచుకుంటా వుండాయి. యేటకు తిరిగే గుంతనక్కలూ, అడివికుక్కలూ అదే పనయినట్టుగా గొంతులు చించుకుంటా వుండాయి. ఆ అరుపుల్ని యింటా అవెంత దగ్గిరగా వచ్చినాయో, యెంత దూరంగా పాయినాయో చెప్పేది మాలదు. అయితే అవట్లా అరిచి నప్పుడంతా నా గుండె జారిపోతానే వుండాది.

గెడ్డమాయిన ప్రమిదలోకి గబ్బువాసనొచ్చే సమురేదో పోసి, వొత్తిని పైకెత్తినాడు. రాతిదిన్నె పైన సవకం పరుచుకోని పండుకోని, "వొరే అబ్బోడా! నేను కొంచెం కండ్లు మూస్తా. నువ్వు కంటిమింద రెప్పెయ్యకుండా వుండు. నక్కో, పులో యేదొచ్చినా నాపైకొక రాయి యిసురు. నేనూ అటకెక్కేస్తా. యీలోపల నేను నిద్రలేస్తే చెప్తాను. అప్పుడు నువ్వు నిద్రపోదువుగానీ..." అనినాడు.

కీనేరుబాయిలో పొంగుకోనొచ్చే నీళ్లమాదిరిగా గుహలో వూటెత్తి నిండిపోయిన మొబ్బు రవ్వంతైనా తగ్గకుండా తిష్టేసుకునింది. యీ రాత్రి యిట్నే కడాంతరం వుండిపోతిందేమోననీ, మళ్లా పగులు అనేదాన్ని చూడ్నేమోననీ వుత్కిష్టంగా వుండాది.

దీగుడు దగ్గిరుండే ప్రమిదలో దీపం సన్నంగా, నిటారుగా, వూగకుండా దిగ్గొట్టిన చీలమాదిరి నిగుడుకోనుండాది. దాని యెలుతురు గోడలపైన, కప్పుపైన పడిన తావుల్లో నీడలు రకరకాలుగా అలుముకోనుండాయి. నా గుండె కొట్టుకునేది తగ్గినా, నా చేతి గెడియారం మాత్రం టక్కుటక్కుమని బెదరగొడ్తానే వుండాది.

కంటిమింద రెప్పెయ్యద్దని గెడ్డమాయిన చెప్పినప్పుడు, "యీరెయ్యి నువ్వు పొమ్మన్నా నిద్రెట్ల పడతాది సామీనాకు?" అని జబాబు చెప్పినాను. అయితే నాకు తెలవకుండానే మూదేవి నన్ను ముంచేసినట్టుండాది. యీలోపల యేందో జరిగినట్టుగా వులిక్కిపడి కండ్లు తెరిచినాను. కొంచేపు నిద్రపోతా వుండానో, లేకపోతే కలలో వుండానో తెలవలేదు. గుహనోటి దగ్గిర కదిలే నీడమాదిరిగా యేందో కనబడింది. నా నిద్రంతా యెగిరిపొయ్యింది. యీతచెట్టు నడిచొచ్చినట్టుగా ఆ ఆకారం వచ్చివచ్చీ రాతిదిన్నెపైన పండుకోనుండే గెడ్డమాయిన కాళ్ల దగ్గిర నిలబడింది. చింతతుండు చీల్చినట్టుండే గొంతొకటి, "దేవరా! సామీ! మునిసామీ!" అని పిలవాటం యినబడీ యినబడనట్టుగా యినబడింది.

అప్పటిదాకా గురక పెడతా వుండిన గెడ్డమాయిన వొకసారి పిలవంగానే ధిగ్గుమని జిల్ల మాదిరిగా లేచి కుర్చున్నాడు. "యేయ్! యెవురు నువ్వు?" అని కోపంగా అరస్తా పేనాకత్తిని దీసి గాల్లో వూపినాడు.

"అయ్యయ్యో! నేనట్టాంటిదిగాదు దేవరా! యీగెవిలో చానా రేత్రులు పండుకోని లేచిపాయినాను. కానీ యెప్పుడూ యింగో నరపురుగును దీంట్లో కండ్ల

జూడలేదు. నీ గెడ్డం, పంచె జూసి సాములోరనుకోని లేపినాను.'' బావురుపిల్లి అరిచినట్టుండే నవ్వు నవ్వతా ఆ ఆడమనిషి ప్రమిద ముందరికి పొయి, సొంతింట్లో కొచ్చినంత ధీమాగా కుచ్చునేసింది. ప్రమిదదీపం వెలుతుర్లో ఆమె కాలిపొయిన గడ్డిమోపు మాదిరిగా కనబడతా వుండాది. చీకేసిన తాటిపండు మాదిరిగా జుత్తంతా ఆమె మూతిని కప్పేసుండాది.

రాతిదిన్నె పైన్నించీ లేచి నిలబడిన గెడ్డమాయిన, ''యింత రేత్రిలో నీకీడేం పని? ముందు బయిటికి పోతావా లేదా నువ్వు?'' అని సింహం మాదిరిగా గర్జించినాడు.

ఆమె గుంతనక్క మాదిరిగా వొక గొంతు గెంతి, ''తూత్తెరీ! యీ గెవిలో నేనూ నా మొగుడూ యెన్ని తూర్లు నిద్రజేసుండామో దెలుసునా నీకు? యిదేందో నీ యబ్బ గంటయినట్టు ఆగడం జేస్తే గొమ్మునుండేది లేదు. నా మొగుడొచ్చినాడంటే నిన్నే తరమగొడతాడు,'' అని అరిచింది. ఆమె అరుపులకు గుహ లోపలినించి పిల్ల అరుపులు పుట్టినాయి.

ఆ మాటతో గెడ్డమాయిన కోపమంతా దిగదీసేసినట్టుగా యిహీహీమని యికిలించి, ''నీ మొగుడా? వాడూ వస్తా వుండాడా నీయెనకమ్మిటీ?'' అని అడిగినాడు.

గుహలోపలుండే గుడ్డి యెలుతురులో వాళ్లిద్దురూ వొకే రకంగా కనబడతా వుండారు. యిద్దరికీ యెనకాల వొకేమాదిరిగా పొడుగ్గా యెంట్రుకలు యేలాడతా వుండాయి. యెవురు యెవురో తెలవాటం లేదు.

''తెల్లార్రేదాంకా కండ్లు తెరవకుండా నిద్రబోవాలంటే నా మొగుడొచ్చి నన్నా అటకెక్కించాల్సిందే...'' అందామె నవ్వతా, నీళ్లుపోస్తానే సుర్రుమని ఆరిపోయే మంటమాదిరిగా.

''యీ పొద్దు ఆటవపైన పిల్లగాడొకడు యెక్కేసుండాడమ్మణ్ణీ! కాలిరిగిందని వాళ్లోళ్లు వాన్నిక్కడ దిగ్గొలికేసి పొయ్యుండారు. యీపొద్దు నీకా తావు దొరకదు,'' అనినాడాయిన కసి తీరిపోయినట్టుగా ముక్కతా.

ఆమె అటవకేసి తిరిగి చూసినాంక, ''ఆడ పండుకుంటే యెవురికైనా ఆమాదిరే వొళ్లు తెలవకుండా నిద్రబట్టేస్తింది. యీడ పిడుగుబడినా ఆ మనిషికి తెలివి రాదు,'' అంటా పెద్దగా నిట్టూర్చింది.

మరిచిపొయిన సంగతి గెవనమొచ్చినట్టుగా గెడ్డమాయిన మూలలో పెట్టుండే జోలెనించీ వొకసత్తు డబరా పైకిదీసి, ''బొరుగులుండాయి. తింటావా అమ్మణ్ణీ!'' అని అడిగినాడు.

"ఆ మాట చెప్పు ముందు," అని ఆ అమ్మణ్ణి ఆయిన చేతల్లోంచీ డబరా లాక్కోని, తిండనేది జన్మంలో జూడనట్టుగా ఆదరాబాదరా బొక్కసాగింది. నేలపైన రాలిన బొరుగుల్ని మట్టితోగూడా జవురుకోని బొక్కలాడింది. గెడ్డమాయిన గుహ ముందరుండే కాలవలోనించి మూకుడులో నీళ్లు పట్టుకోనొచ్చినాడు. అమ్మణ్ణి మూకుడ్ను పెరుక్కోని సగం నీళ్లు మూతిపైన్నించీ కిందికి కారిపోతా వుండంగా గుటగుటమని తాగేసింది.

గెడ్డమాయిన అదోమాదిరి నవ్వుకుంటా జోలెలోనించి యేందో యెత్తుకోని దీపం దగ్గిరికిపొయి కుర్చున్నాడు. కొంచెంపయినాక ఆయిన పెద్దగా పీల్చినాడు. ఆయిన దగ్గిర్నించీ పొగగూట్లోనించీ వచ్చినట్టుగా పొగలు బయటికొచ్చినాయి. ఆ వాసన బీడీ వాసన మాదిరిగా లేదు.

యింకోసారి పెద్దగా పీల్చి పొగ యిడిసిపెట్టి, "నీ మొగుడింకా రాలేదేం అమ్మణ్ణీ! యీ అడివిలో యేడ తగలకపొయినాడు?" అని అడిగినాడు గెడ్డమాయిన.

"ఆడికీ ఆమాస్యకూ యీ మాదిరిగా అడివిలో రేత్రుల్లో వుండిపొయ్యేది నాకేమీ కొత్తగాదు దేవరా! యెంటవో, పునుగుపిల్లో దొరికేస్తిందనే ఆశితో గాసొచ్చినా తిరిగి మల్లేదేలేదు. అయితే నా యెనకమ్మిటే కొంగుమాదిరిగా నా మొగుడనేనపు రుంటానే వుండేటోడు. యాడ దోవదప్పొయినా రేత్రుల్లో తల దాంచుకునే దానికి యేడ యే చెట్టుండాదో, గెవుండాదో, బండుండాదో అరిచేతిలో గీతలు దెలిసినంత బాగ దెలుసు నాకు. యీపొద్దు వానికేందో తలకాయలో పురుగుజేరింది. నిన్నిడిసేస్తా వుండాను పోపొమ్మే అని రవాటించినాడు. అంతే, పోపోరా అనిజెప్పి యిసిరికొట్టి, అడ్నించీ యెలబారొచ్చేసినా. యీ అడివి వానికెంత దెలుసునో దానికంటే నాకే జాస్తీగా తెలుసునని యీ పొద్దు వానికి తెలిసేకావాల్ల..." అమ్మణ్ణి కత్తితో కోసినట్టుగా మాట్లాడింది.

"అదీ మాటంటే! వాడు లేకపోతే చలాయించుకోకుండాపోతామా?" చుట్టూ అలుముకున్న పొగల్ని చింపుకోని గెడ్డమాయిన మాటలు బయిటికొచ్చినాయి.

"వాడు అన్నిటికీ తెగాయించినోడు. నా రొంటిలో వుండే ఆ నాలుగు రూకల్నీ యెట్లయినా పీక్కోని పోవాలని యెగజూసుకోనుండాడు. వానికి దెలవకుండా యాడపెట్టాల్నో నాకు దెలుసు" అమ్మణ్ణి రోషంతో బుసలుగొడతా వుండాది.

"దాంచిపెట్టే దానికి వేరే తావు దేనికమ్మణ్ణీ! యీడ్నే వొక తావుండాది. వానబ్బా పాలాక్షుడే వచ్చినా కనిపెట్టలేడు," అంటా గెడ్డమాయిన గుహగూటి ముందుండే గోడపైన నిలువెత్తుండే రాయి దగ్గిరికి పొయినాడు. అమ్మణ్ణిగూడా ఆయిన యెనకాల్నే పొయింది. ఆయినక్కడే రగస్యం తావు జూపించినాడో, అక్కడ అమ్మణ్ణేం దాంచిపెట్టిందో నాకు కనబడలేదు.

ఆపనయినాక తిరుక్కోనొచ్చి పొయ్యిగెడ్డపక్కన గొంతుక్కూర్చోని, "పొయిన శుక్రారం యెర్రావారిపాలెం సంతలో వొక బసివిముండ గనబడింది దేవరా వాని కండ్లకు. యెర్రంగా బుర్రంగా సొరకాయి మాదిరిగా కంటికి గోరగిస్తా వుండాదది. ఆ ముండ వాని చెవల్లో యేం గునిసిందోగానీ అప్పటినించే వీడిట్లా కాలబడ్నాడు. అప్పటికి నేనేనా తక్కవ తినింది?" ఆమె మళ్లా కోపంతో యినబడేటట్టుగా పండ్లు కొరికింది.

పొగను గుప్పుగుప్పుమని యిడిసిపెడ్తానే, "సరైన పనిజేసినావులే అమ్మణ్ణీ! అప్పటికి మనకేనా గిరాకీలేంది? వానికంటే చానానే వుండాదది," అనినాడు గెడ్డమాయిన.

ఆమెను కలగలుపుకోని మనం మనమని ఆయిన మాట్లాడతా వుంటే నాకు అయోమయంగా వుండాది. అదేమీ యిచిత్రం గానట్టుగా అమ్మణ్ణి తలూపుకుంటా రవాటించింది. "జంపుగా పెద్ద యెలుంగొడ్డు మాదిరుండానని వాని ధయిర్నం. నేను పీలగా, గిత్తగా వుండానని, నన్నేమైనా చెయ్యచ్చునని వాని తెగాయింపు. దబ్బనమెంత గద్దుంటాది? గెరిసంత గోతంనోరు కుట్టిపారేస్తాదా లేదా? నేనూ అంతే! వీనికంటే ముందు, వీనికంటే బలమైనోడ్ని చీమిడి చీదినట్టుగా చీది పారేసుండాను. ఆ సంగతి వానికీ దెలుసు. నా యెనకాలెంతమంది సొంగులు గార్చుకుంటా తిరగతా వుండారో అదీ దెలుసు. అయినా మూలకెక్కలేదు. నాతోనే పెట్టుకున్నాడు. నా సంగతేందో దెబ్బేసి చూపిస్తాను జూడు..."

యెవురో పెద్దంగా నవ్వినారు. అది అమ్మణ్ణి నవ్వో గెడ్డమాయిన నవ్వో నాకు తెలవలేదు. అయితే సరింగా మావూరి భారతం రెయ్యాటలో దుశ్శాసనుడ్ని జూసి ద్రవుపదమ్మ యేషం గట్టినోడు నవ్విన నవ్వు మాదిరే యినబడిందది.

"దొరికిందంటే దరాములు దరాములుగా తాగేస్తాడు. తాగినాడంటే యిరతం పరతం దెలవదు. వొగతూరి తాగేసొచ్చి మంచంపైన పండుకోనుండేది నేనేననుకోని పక్కింటి పిలగాడిపైన పడినాడు. వాడు నెత్తీనోరూ గొట్టుకున్నా యిడిసిపెట్టలేదు. యెందుకు చెప్తావులే దేవరా, ఆ పొద్దు నా మానమేపొయ్యింది. వాడేమో మొగలాయి పనిజేసినట్టుగా మీసాలు దిప్పినాడు. అప్పుడొకతూరి అడవిలో నా సవితినొకదాన్ని చెట్టుకు గట్టేసి దాని ముందర్నే నాపైకి బడినాడు. తాగితే వానికీ చిత్తకార్తి కుక్కకూ, కోపుమిందుండే గొడ్డుకూ తేడా లేదు." యెవురి గురించో చెప్పేటట్టుగా చెప్పుకోని పొయిందామె.

"నువ్వెవురికీ బయిపడాల్సిన అగిత్యంలేదు అమ్మణ్ణీ! నా సంగతి నీగ్గూడా తెలవదు. ప్రాయంలో వుండేటప్పుడు పదిశేర్లు వొడ్లు వొంటిచేత్తో దంచి పారేస్తా

వున్నాను. పొయ్యిపైన వుడకతా వుండే యిరవైశేర్ల డేగిశాను వొక్కడ్నే పైకెత్తి గెంజి వార్చేస్తా వున్నాను...''

''ఆమాటకొస్తే నేనూ తగ్గేదిలేదు. యిప్పుడైనా నిలువెత్తు రాతికూసాన్ని అబ్బలించి పైకెత్తి పారేస్తాను. పది మణుగుల బరువుండే కట్టెలమోపెత్తుకోని పదిమైళ్లయినా నడిచిపోతాను. యెనకాల్నించీ వచ్చి దొంగదెబ్బదీసే మాదుర్చేదుల్ని గురించే నా బయిమంతా!''

గుహ బయిట అడివినక్కలు పెద్దవూళ లేస్తా వుండాయి. పొదల్లో యేవో జీవాలు పరిగెత్తతా వుండాయి. కొమ్మల పైనెక్కడ్నో పగిడిగంటి చిన్నపిల్లోడు యేడస్తా వుండేట్టుండే కూతలు కూస్తా వుండాది.

''కొంచెం గోడపక్కకు జరుక్కో దేవరా! యెవుడో వస్తా వుండాడు. వాడేలే... వాడే అయ్యుంటాడు. వాడుగాకపోతే యింకెవురొస్తారీ రేత్రిలో యీ గెవికాడికి?... నా దగ్గిర బిచువా వుండాది. నీ దగ్గిర కత్తిగిత్తీ వుంటే తీసి చేత్తో పట్టుకో...'' అంటా అమ్మణ్ణి ప్రమిద దీపంలో యెలగతా వుండే వొత్తిని నూనెలోపలికి తోసేసింది.

గుహ మల్లా చీకట్లో కలిసిపొయ్యింది.

## 7

రాతిదిన్నె మింద గెడ్డమాయిన గురకదీస్తా వుండాడు. పొయ్యిగడ్డ పక్కన అమ్మణ్ణి యేంజేస్తా వుండాదో తెలవదు. బయిట కొమ్మలు పెళపెళమన్నప్పుడంతా మొగుడేమోనని బిచువా పైకెత్తుకుంటా వున్న మనిషి, యిప్పుడా సంగతే మరిచి పొయినట్టుండాది. కాలిన మరదామి చెరుకుతోట మాదిరిగా నల్లంగా అయిపొయిన చీకటిగుహ లోపల యెవురెవురెక్కడేం జేస్తా వుండారో తెలవదు. కంటిచూపు పొయి గుడ్డోన్నయిపొయినానేమోనని డవుటుగా వుండాది. గుహ బయిట చిరతపులో, గుంతనక్కో, నాగుబామో, జెర్రిపోతో, యేది తిరగతా వుండాదో యెట్ల దెలిస్తింది?

మా యింట్లోవాళ్లకు నాకీమాదిరిగా కాలిరిగిందనయినా తెలిసిందో లేదో! ప్రభావతి కోసరమని గాకపొయ్యుంటే నేనీ అడివిలోకి అడుగైనా పెట్టుండను. నేనిక్కడిట్లా అగోరిస్తా వుండాననయినా ఆ అమ్మికి గెవనముండాదో లేదో! యీ రెయ్యికి అంతమనేదే వుండేటట్టు లేదు. నా బతుకంతా యీ అటవపైన్నే ముగిసి పోతిందేమో! నాకు యేడుపు ముంచుకోనొస్తా వుండాది.

సగం మూతలు బడిన కండ్లకు దిగ్గుమని యెలుతురేందో గనబడంగానే వులిక్కిపడి పైకి లెయ్యబొయినాను. కాలు కదలతానే రంపంతో కోసినట్టుగా నొప్పి మెలి తిప్పేసింది. తన్నుకోనొస్తా వుండే అరుపును గొంతులోనే నొక్కిపట్టేదానిగ్గాక పోవాటంతో తనకలాడిపొయినాను.

సినిమా కొటాయిలో పొజెక్టరు దగ్గిరినించీ గూట్లోదూరి తెరపైకి వచ్చిపడే పొగల యెలుతురు మాదిరిగా పొడుగ్గా, సన్నంగా, యెలుతురొచ్చి గుహలోపల పడి చుట్లా తిరగతా వుండాది.

“డూయ్, యారుడా అంగె తూంగతా పండుండేది?” అని అరుచుకుంటా బాట్రీ యేస్తా వుండే మనిషి రాళ్లపైన చెప్పులు గరగరమంటా వుండంగా లోపలి కొచ్చినాడు.

యినపతవ్వలో పెట్లొప్పుదిగ్గొట్టి బండపైన కొట్టంగానే డబామని మండే మంట మాదిరిగా ఆ అరుపు యినబడంగానే గభామని పైకిలేచి, “నేనేన్నా... నేనే సామీ... నేనే,” అని జబాబు చెప్పినాడు గెడ్డమాయిన.

“నువ్వంటే యారుడా? ఆ మూల పండుకోనుండే పొన్మేటెవురు?” ఆ వచ్చిన మనిషికంత కోపమెందుకొస్తా వుండాదో అర్థం గాలేదు.

“యీ రేత్రిలో యిట్లొచ్చుండే నువ్వెవురన్నా? కొంచెముండు, దీపం యెగదోస్తాను” అనినాడు గెడ్డమాయిన. వక్కగొరికేటంత సేపులో దీగుడు దగ్గిరుండే ప్రమిదకు దీపం తగులుకునింది. దాని యెలుతురో గోడకు అనుక్కోని బిత్తర చూపులు జూస్తా అమ్మణ్ణి గూడా కనబడింది.

గెడ్డమాయిన నిండుకుండ మాదిరిగా తొణక్కుండా బెనక్కుండా రాతిదిన్నె పైన కుర్చోనుండే మనిషి దగ్గిరికొచ్చి, “వుండేది మేమిద్దురేలేన్నా! ఆ అటవపైన కాలిరిగిన పిల్లోడు ముక్కతా మూల్గతా పండుకోనుండాడు. లోపలింకే మెకంగానీ, మనిషిగానీ లేదు. నువ్వు ధైర్నంగా కుర్చోయింగ...” అనినాడు.

అయిదారు బారలకవతల చస్తినో అని యెలగతా వుండే ప్రమిద దీపం యెలుతుర్లో ఆ వచ్చిన మనిషి అడియాలం సరింగా కనబడాటంలేదు. యేసుకో నుండే పొంటూచొక్కాయీ కందెనగుడ్డతో కుట్టించినట్టుగా నల్లంగా వుండాయి. తలపైన నల్లదే గుడ్డటోపీ వుండాది.

“వానికి వున్మయిగా కాలు పునికిందా? యిల్లాకట్టి ఫారెస్టోడా?” ఆ నల్లటోపీ మనిషి అనమానంగా బాట్రీని నాపైకేసినాడు.

“యీ కాలెట్లా వూదిపొయ్యుండాదో చూడన్నా!” అని నేను బొరోమని యేడవబొయినాను.

కొంచేపు గొమ్ముగా వుండిపొయినాంక నల్లటోపీ మనిషి యీపుకుండే సంచిని వూడదీసి, దాంట్లోనించీ పెద్ద ప్లాస్టిక్కు సీసాయిని పైకిదీసి, “రెండు లీటర్ల పాలుండాయి. అడుపుపైన వుడుగ్గా కాంచు,” అనినాడు.

"యీ సట్టిలో నిన్నపుడకేసిన పులగమట్నే చిమిడి చచ్చుండాది. కడుక్కోనొస్తా నుండన్నా!" అని చెప్పినాంక గెడ్డమాయిన సట్టిని బయటుండే కాలవలో కడుక్కో నొచ్చినాడు. ఆసరికి అమ్మణ్ణి పొయ్యిలో కట్టెపుల్లలు పెట్టి ప్రమిద దీపంతో ముట్టించింది.

సీసాయిలో వుండే పాలను సట్టిలోకి పోస్తా, "పాలు యెచ్చంగా వుండాయి. పిండి గంటయినా అయ్యుండదు," అనినాడు గెడ్డమాయిన.

"మాంతమయిన మూలుండాదే నీకు! వుతామారుగా లెక్కేసినట్టు చెప్పుండావు," అంటా నల్లటోపీ మనిషి సిగరెట్టు ముట్టించుకున్నాడు. "నాకీ పొద్దు యిరవంతా మానుపైన జాగారమేననుకుంటి. చెట్టు కియ్యత్తిలే మాడు అంబా అని అరిసింది. బాట్రీయేసుండాను. పెద్దమాడూ, దానెనకాల దాని దూండా వుండాయి. మాను దిగినాను. దూండ అప్పటికే పాలు తాగుతాండాది. దాని వయిరు నిండిందో యేమో, పక్కకు తిప్పుకునింది. అప్పటికే మాండు రొంబాసేపుండాది. లోటాతో పిండి పిండి బాటిల్లోకి పోసుండాను. పాపం, ఆ మాండు దూండ తాగతాండాదని అనుకోనుండాది. అమదియాగ వుండిపొయ్యుండాది. నేను పిండుకున్నాంక ఆ మాండు దాని దూండను నాంకుకుంటా చక్కాపొయ్యేసింది..."

"సొంత గల్లోల్లెవురో మేతకని అడివికి దోలేసుంటారన్నా. అది అడివిలో యీనేసుండాది. ఆ సొంతమోళ్లకు దాని పాలుతాగే రుణంలేదు. మనకా రుణ ముండాది," అమ్మణ్ణి గొంతు కీసుకీసుమనింది.

పొయ్యిలో మండతా వుండే కట్టెపుల్లలు చిటపటమంటా వుండాయి. పాలు కాగినాక, "లోటా వుండాదంటివిగదా! యియ్యన్నా!" అని అడిగినాడు గెడ్డమాయిన.

వుడుకుపాలు చప్పరించుకుంటా తాగేసినాంక, "మీదుముండేది మీరు కుడుప్పండి," అనినాడు నల్లటోపీ మనిషి.

గలాసును నీళ్లల్లో కడుక్కున్నాంక రెండో గలాసు అమ్మణ్ణి తాగింది. మూడో గలాసు గెడ్డమాయినకు. కడాకు మిగిలింది గలాసులో పోసుకోనొచ్చి నాకిచ్చి, "బెల్లం యెయ్యకపాయినా తియ్యంగావుండాయి. యీమాదిరి గోచీరం తాగాలంటే అడిగేసొచ్చుండాల," అనినాడు గెడ్డమాయిన.

వుడుకుడుకు పాలు నిజెంగా అమురుతం మాదిరే వుండాయి.

"శివుని మాట లేకుండా చీమకూడా కరవదంటారన్నా! రాసిపెట్టుంటే నువ్వు కొండమిందుంటే గూడా నీ కవళం నిన్నెతుక్కుంటా వస్తాది. లేకపోతే యీ నడిరేత్రిలో, యీ యరవకాడ, యీ తావుకు సీసాయి పాలెత్తుకోని నువ్వెందు కొచ్చుండావు చెప్పు!" అని సంబరంగా నవ్వుకున్నాడు గెడ్డమాయిన. మల్లంక, "రెయ్యి కంటిమింద రెప్పెయ్యలేదంటివి గదా, యిప్పుడు కొంచేపు పండుకోన్నా!" అనినాడు.

నల్లటోపీ మనిషి నోరంతా తెరిసి, పెద్ద చప్పుడయ్యేటట్టుగా ఆవులించినాడు.

“నీ చొక్కాయి పర్రలుపర్రలుగా చినిగిపొయ్యుండాది. చెప్పులు బురద గొట్టుకోనుండాయి. చేతలకు ముండ్లు గుచ్చుకోనుండాయి... యేదయినా పులో, గుంతనక్కో తరుముకునిందా నిన్ను?” అని గెడ్డమాయిన విచారించినాడు.

“నరినక్కో, పులిసింగమో కాదు. వాళ్లకు తరుంకుండేదీ పుదుసుగాదు. యనక్కు వోడ్రదూ... పరింగెత్తిపొయ్యేదీ కొత్తంగాదు...” అనేసినాడు నల్లటోపీ మనిషి అదొకరకంగా నవ్వతా.

గెడ్డమాయిన కొంచేపు గుండ్రాయి మాదిరిగా గొమ్మునా గుచ్చోని ఆమైన, “యెర్రగందం చెట్లు కొడతావాన్నా నువ్వు? అట్లయితే నీకెప్పుడూ వాళ్లతో పాటుకే!” అని నిట్టూర్చినాడు.

నల్లటోపీ మనిషి గూడా కొంచేపు గొమ్మునా వుండిపోయినాంక, “అట్లనిజెప్పి బయింపడితే జరిగితిందా సామేరీ! సంబళం కోసరమని వచ్చుండాం. పని చేసే కావాల. అనుకున్న పని తీరుమానం జేసేపోవాల!” అని చిన్నంగా నవ్వినాడు.

“అదేన్నా మాటంటే! యింగొగడి కడుపు కొడతా వుండామా జెప్పు? లేదే! మనపని మనం లక్షణంగా జేసుకుంటా వుంటే అడ్డమొచ్చేదానికి వాడెవుడు?” అని గెడ్డమాయిన వంత బాడినాడు.

“కాండు యెవుడబ్బా సొత్తు సామేరీ! మాన్లను వాళ్లేమైనా నాటి వుండారా? వాండ్లు గొట్టి లారీలకెత్తకపోతే నీదీ, మనం గొట్టితే అనీదీ అంటా వుండారు. మనం యెవుండు సంబళం యిస్తే వానికిదా కొట్టియిస్తుము. వాళ్లే ఆ సంబళం యిస్తే వాళ్లకే కొట్టియిస్తుము. వాడూ పని యీడు. మనకు అడ్డమూ పడుతుడు. అమ్మా పెట్టకుండా, బిక్షమూ యెత్తకుండా వుండమని రంపుజేస్తాడు,” నల్లటోపీ మనిషి కచ్చిగా అరిచినాడు.

“వాడెవుడో చెప్పన్నా! వాన్నొకతూరి జాడించి పారేసొస్తాను...” వూడిపోతా వుండే పంచెను యిష్టమొచ్చినట్టుగా నడుముకు చుట్లా దోపుకుంటా గెడ్డమాయిన సుట్రగాలి మాదిరిగా పైకి లేసినాడు.

“వానితో రంపు యిప్పుడిది కాదు సామేరీ! నూరునూరేండ్లుగా మాపైన కంటు పెట్టుకోని వుండాడు. మా తాత్తా కాట్టుజీవాల్ని వేంటాడే దాంట్లో పేరెత్తినోడు. యాన్నై దంతాలు గూడా గొట్టి తెచ్చుండాడు. అప్పుండు మా తాత్తాక్కూ అడ్డంపడినాడు. మా అప్పా సారాయిం గాంచేదాంట్లో మొగిలాయి. మా అప్పాగాంచిన సారాయిం తాగితే తవరన్నారు. వాళ్లుగాంచి అమ్మేంది తాగితే సరి అన్నారు. యిప్పుండు నన్నూ నా పనికి అడ్డం అడ్డం వస్తాండారు. వీళ్లు నా కొడుకుకు గూడా అడ్డమే రాబోతారు...”

“యెవుడన్నా వాడు? యాడుంటాడా పోసుగోలు మనిషి?” నల్లటోపీ మనిషి శాంతంగా మాట్లాడినా గెడ్డమాయిన మాత్రం కోపంతో వూగిపోతా వుండాడు.

“యెక్కడ్నో నూర్లూవేలూ మైళ్లకా పక్కనెంగో వుండాడంట సామేరీ! అయితే వానికి అడియే దాసోహమంటా చానామందుండారు. వాండ్లకు తుపాకీలూ, జీపులూ వుండాయి. మన తావులోనించీ మనల్నే తోలేయబోతారు. గొమ్ముగా మన పని మనం చేసుకుంటా పొయినా మనపైకొచ్చి పడతారు...”

“లోకమెప్పుడూ యిట్నే వుండాదన్నా, నువ్వు జెప్పేదే నిజం. యిరణ్యాకశిపుడు గొమ్ముగా వున్నా యిష్ణుమూర్తి గొమ్ముగున్నాడా? లేదే! కిష్ణ పరమాత్ముడు వూరికా గుచ్చోనుండినా కంసుడు వూరికా గుచ్చున్నాడా? లేదే! భూమిపైన్నుండే బరువు దగ్గించాలంటే యుద్దం జరిగే కావాల. ఆ బగమంతుడే జెంతువుగానో, మనిషిగానో పుట్టే కావాల...”

బయట గడ్డిగుముల దగ్గిర్నించీ బడబడమనే శబ్దం వచ్చింది.

నల్లటోపీ మనిషి గబామని పైకి లేచి గుహలోపలికి సరసరమని నడిచి, గూడు దగ్గిర గోడకతుక్కున్నాడు.

అమ్మణ్ణి కూడా గోడకు బావురుకప్ప మాదిరిగా అనుక్కునింది.

గెడ్డమాయిన గుహనోటి ముందరకుపోయి నిలబడుకున్నాడు. ఆ చీకట్లో ఆయినగూడా చెట్టుమాదిరిగా కనబడినాడు. వున్నట్టుండి ఆయిన రెండు అరిచేతులూ మూతిపైన పెట్టుకోని గుర్రుగుర్రుమని యెలుంగొడ్డు మాదిరిగా అరిచినాడు. సన్నంగా వూనాపంగాడు మాదిరుండే ఆ మనిషి అంత గెట్టింగా అరస్తాడని నేననుకోనేలేదు. ఆ అరుపుకు చెట్లపైన నిద్రపోతా వుండే కబోది పిట్టలూ, పగిడిగంట్లూ, బెళబాయిలూ రెక్కలు గొట్టుకుంటా పైకెగిరినాయి.

అదేమాదిరి యింకో రెండుతూర్లు అరిచినాంక గెడ్డమాయిన లోపలికొచ్చి, ప్రమిద ముందర కుచ్చోని, వొత్తినెగదోస్తా, “మడుసులయితే నా అరుపు యిని బయింతో పారిపొయ్యుంటారు. పులయినా, నక్కలయినా, పసరమేదయినా యెలుంగొడ్డుండే తావుకు రమ్మన్నారావు. యింగ బయిమేంలేదు...” అనినాడు.

జోలెలోపల్నించీ చిలుందీసి పుల్లతో దాన్ని ముట్టించినాడు. నల్లటోపీ మనిషి గూడా ఆయిన పక్కన గుర్చునేసినాడు. కొంచేపయినాంక జూస్తే అమ్మణ్ణి గూడా వాళ్ల వుడ్డలోకి జేరిపొయ్యుండాది.

కుమ్మరోళ్ల కుండలు కాల్చేబట్టీ మాదిరిగా వాళ్లు గనపడకుండా ఆ తావు నంతా దట్టంగా తెల్లంగా పొగలు సుళ్లు తిరిగతా వుండిపొయినాయి.

## 8

"లెయ్యి లెయ్యి లెయ్యరా పిల్లోడా!"

ఆమాట పదిమట్ల బాయిలోనించీ పిలిచినట్టుగా నా చెవులకు తగిలీతగల కుండా తాకింది.

"భలే నిద్రపొయినావు గదా! లెయ్యన్నా! యిప్పుడు యెలబారితేగానీ మద్దానానికి పాపనాశినం జేరలేం" అని పళ్లన్నీ యికిలించి నవ్వతాగనిపించినాడు సుబ్బరాయుడు.

"లెయ్యిరా పిలగాడా లెయ్యి! ముచ్చుగాల్చి తాగినోళ్లెప్పుడో లేచూడ్సినారు. వాళ్లోళ్ల పనికి వాళ్లు యెలబారిపొయినారు. ఆ వాసనకే నువ్వు విషనీళ్లు దాగినట్టుగా ముడుక్కున్నావు. భళ్లుమని తెల్లారి పొయ్యుండాది. పొగుల్లో యీ గెవిలో వుండమన్నా వుండేటోళ్లెవురూ వుండరు..." అని గెడ్డమాయిన కసిరినాడు.

సుబ్బరాయుడితో గూడా యింకో యిద్దరు కొత్త మనుషులుండారు. వాళ్లు నన్ను చంటిబిడ్డను దించినట్టుగా అటవపైన్నించీ కిందికి దించేసినారు. కదిలినప్పుడంతా నా కాలు మాత్రం జివ్వుజివ్వుమని జెర్రిపోతు పీకినట్టుగా మండక పోతా వుండాది. పళ్ల బిగవన నొప్పిననిచి పెట్టుకుంటా వుండాను.

వచ్చిన కొత్త మనుషులు పెద్ద యెదురుకట్టెను తెచ్చుండారు. దానికి రెండు దుప్పట్లు వుయ్యాల మాదిరిగా గట్టినారు. ఆ వుయ్యాల్లోకి నన్ను జేర్చి, యెదుర్ను రెండు పక్కలా యిద్దరెత్తుకునేసినారు.

"రేత్రంతా యాడికి పొయినావురా?" అని సుబ్బరాయుడ్ని మొరిసి జూసినాను.

"ఆపక్క కొండమోపులో రెండు పండుకోతులొక పిల్లకోతిని కొరక్క తినేస్తా వున్నాయన్నా! అవిట్ని తరిమేసి, ఆ పిల్లకోతి నిడిపించేదానికి నా పాణం తోకకొచ్చింది. ఆడ్నించీ తిరుక్కోనొస్తా వుంటే పులి గొంతు యినబడింది. గబగబా పక్కనుండే బాగి చెట్టెక్కిసినా. రేత్రంతా కొమ్మపైన్నే జాగారం చేసినాను. తెల్లారినాంకగానీ కిందికి దిగలేదు. దిగతానే మనోళ్లు గనబడినారు," అనినాడు సుబ్బరాయుడు.

కొంచేపు వూయలమాదిరిగా, యింకొంచేపు పల్లకీ మాదిరిగా వుండే ఆ దుప్పట్లలో కాలుకు నొప్పి తగలకుండా పక్కకు వొరుక్కున్నాను. నన్ను అలాగ్గా మోసుకుంటా, భుజాలు మార్చుకుంటా, వాళ్లు నలుగురూ కదలబారినారు.

మాతోగూడా కొంచెం దూరం నడిచినాంక, "యింక నేనిట్లా పోవాల్రా పిలగాడా! అదేం పెద్ద దెబ్బ గాదులే! కట్టుగడితే రెండు వారాల్లో మల్లాలేసి దుమకతావు," అనినాడు గెడ్డమాయిన. చీలుదోవ దగ్గిర ఆపక్కకు తిరగతా నా పక్కకు వొంటి కంటితో చూసి, "అమ్మణ్ణికి వూర్లో కంటే అడివిలో వుంటేనే

నెమ్మతంట! వానికి రేత్రే పగులు కంటే సుఖంగా వుంటిందంట! నేను అడివీ రెయ్యీ కలిస్తేగానీ నీళ్లల్లో పడిన చేపమాదిరిగా తెంపుగా వుండను. రేత్రయ్యేదాంకా కాలు కాలూ గొట్టుకుంటా తిరగమని నా నొసట్న రాసిపెట్టుండాది,'' అని గెడ్డమాయిన పెద్దగా నవ్వినాడు.

కొంచెం దూరం పొయినాక దుప్పట్ని పక్కకు జరిపి తల తిప్పి చూసినాను.

దూరంగా పోతా వుండే గెడ్డమాయిన యెలుంగొడ్డు మాదిరిగా చేతులు పైకెత్తుకోని నడస్తా వుండాడు. కండ్లు నులుముకోని చూసినాను. ఆ రవ్వంతసేపుట్లోనే ఆయిన సవకాన్ని కొంగు మాదిరిగా భుజంపైనేసుకోని కులకతా అమ్మణ్ణి మాదిరిగా నడిచేదానికి మల్లుకున్నాడు.

నావొళ్లు పెద్దగా అదిరింది. కండ్లకు బూసులు గమ్మినాయి. తడిగుడ్డతో ముఖం తుడుసుకోని చూసినాను. పొడుగ్గా యేలాడతా వుండే జుత్తుపైన ఆయిన నల్లటోపీ పెట్టుకోనుండాడు. ఆయిన మలుపు తిరగతానే టోపీ మాత్రమే గనబడింది. రాత్రి వచ్చిన నల్లటోపీ మనిషే అక్కడ పోతా వుండేటట్టుగా గనబడింది.

ముంతలో వుండే నీళ్లు చెరువు నీళ్లల్లో కలిసిపొయినట్టుగా గెడ్డమాయిన అడివిలో కలగలిసిపొయినాడు.

*'తెలుగు పెద్దకథలు' కథాసంకలనం*
*13 నవంబర్ 2022*

*




16 జులై 1957న పుట్టిన **మధురాంతకం నరేంద్ర** మొదటి కథ *చివరికి దొరికిన జవాబు* 1975లో ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి మేగజైన్‌లో అచ్చయ్యింది. *కుంభమేళా, అస్తిత్వానికి అటూ-ఇటూ, రెండేళ్ల పద్నాలుగు, నాలుగుకాళ్ల మంటపం* కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. పదేళ్లపాటు వెలువడిన *కథావార్షిక*కు సహ సంపాదకులు. *తాత్త్విక కథలు* సంకలనానికి సంపాదకులు. ఆటా నవలల పోటీలో మొదటి బహుమతి పొందిన వీరి నవల *మనోధర్మపరాగం*కు కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. ఎస్.వి. యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు.

*చిరునామా: 15-54/1, శ్రీ పద్మావతీ నగర్, తిరుపతి - 517 502*
*ఫోన్: 98662 43659* *manarendra@gmail.com*